


# గోమతా

*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బుడి ముబ్బిడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్థమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్థికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

**మెల్‌బోర్న్ మహానగరం..** ఆస్ట్రేలియా ఖండంలోని గొప్పనగరాలలో ఒకటి. నగరానికి మధ్యలో క్రౌన్‌ప్లాజా హోటల్ పక్కన నెమ్మదిగా, అందంగా ప్రవహించే యారా నది ఒడ్డున రెయిలింగ్‌ని ఆనుకుని నిలబడి ఉంది కేరోల్.

కేరోల్‌కి దాదాపు యాభై సంవత్సరాలుండవచ్చు. తెల్లగా సన్నగా, ఎంతో చురుకుగా, అందంగా ఉంటుంది. చిన్న కోల ముఖం, నీలి కళ్ళు, కొనదేలిన చుబుకం, గ్రే, గోల్డెన్ జుట్టు.. నీలం రంగు జీన్స్, తెల్లటి టాప్ ధరించింది.. కేరోల్ ఒక బయోటెక్నాలజీ కంపెనీలో ఈ.హెచ్. ఎస్, అంటే ఉద్యోగుల ఆరోగ్యం, భద్రతల విభాగంలో సీనియర్ అధికారి. లాబొరేటరీలూ, వాటిలో పరిశోధనలకి ఉపయోగించే పరికరాలు, రసాయనాలు, జంతువులు అన్నింటికి మించి శాస్త్రవేత్తలు ఎలాంటి పద్ధతులు, మెళకువలు పాటించాలో పర్యావరణానికీ, తమ సంస్థలకీ, ఏ మాత్రం హాని కలగకుండా ఎలా నడుచుకోవాలో తెలియచేసే విభాగం అది.

కేరోల్‌కి మొదటినించీ, ప్రకృతి అన్నా, జంతువులన్నా, మొక్కలన్నా ఎంతో ప్రేమ. అనునిత్యం వాటిగురించే ఆలోచిస్తూ ఉంటుంది. తన ఇష్టానికి తగ్గ రంగాన్ని ఎంచుకోవడం వల్ల ఆమె తన ఉద్యోగాన్ని కేవలం జీతమిచ్చే పనిగా కాక ఎంతో బాధ్యతగా నిర్వహిస్తుంది.

మెల్‌బోర్న్ లోనే పుట్టి పెరిగిన కేరోల్‌కి ఆ నగరం నడిబొడ్డులో విశాలంగా ప్రవహించే ఈ యారా నది అన్నా, దగ్గరలోనే ఉన్న యారా వేలీ అన్నా ఎంతో ప్రేమ. ప్రతీ వారాంతంలోనూ, లేదా వీలున్నప్పుడల్లా తన ఇంటినించి ట్రాం ఎక్కి క్రౌన్‌ప్లాజా హోటల్ దగ్గర బస్ స్టాప్‌లో దిగి నడిచి యారా నది దగ్గర కొంత సేపు గడుపుతుంది ఆమె. భర్త ఓవెన్‌కి వీలున్నప్పుడు వస్తాడు, లేదంటే తను ఒక్కర్తే వస్తుంది.. గంటా, గంటన్నర సేపు అలా హాయిగా గడపడం ఆమెకెంతో ఇష్టం.

ప్రతీవారం లాగానే ఈ వారం కూడా వచ్చింది. అప్పుడే సరిగ్గా సెల్ ఫోన్ మోగింది. ఫోన్ తీసి డయల్ చేస్తున్నదెవరా? అని చూసింది. మరీ ముఖ్యమైనది కాకపోతే ఫోన్ ఎత్తకుండా తర్వాత చేస్తుంది. తనదైన ఆ సమయాన్ని మరే ఇతర కార్యక్రమానికి వెచ్చించడానికి పెద్దగా ఇష్టపడకపోవడమే అందుకు కారణం.

'జాగ్, సుజయా ఇండియా' అన్న అక్షరాలు ఫోన్ స్క్రీన్ మీద చూడ గానే ఆమె కళ్ళు విచ్చుకున్నాయి.. వెంటనే ఫోన్ ఆన్ చేసి

"హలో, జాగ్, సుజ్.." అంది ఆనందంగా.

అవతలవారు చెప్పిన మాటలు తమకి వినబడకపోయినా అవి ఆమెకెంతో ప్రియమైనవని క్షణాల్లో మారిన ఆమె ముఖకవళికలు చూసిన వారెవరైనా నిమిషాల్లో గుర్తు పట్టవచ్చు.

"ఓ అవునా, హౌ నైస్... బాగా కోలుకున్నాడన్నమాట.. అవును.. నాకు కూడా అలాగే అనిపించింది.. మొన్న మీరు పంపిన ఫోటోలు చూశాను కదా.. వీడియోలో కూడా చాలా బావున్నాడు. అయితే తొందరలోనే నేను ''గోమతా' ' ని కలుసుకోబోతున్నానన్న మాట. పరవాలేదు. మరొక్క ఆరునెలలేగా.. ఆగుతాను. 'గోమతా' వచ్చే సమయానికినేనే వెళ్ళి తీసుకొస్తాను. సింగపూరే కదా, మరేం పరవాలేదు.." సంతోషంతో మాటలు దొరకడం లేదు.. ఆమెకి. మరొక మూడు నిమిషాలు వారితో మాట్లాడాకా ఫోన్ పెట్టేసింది.

తన స్నేహితుడితో కలిసి ఫిషింగ్‌కి వెళ్ళిన ఓవెన్ మరొక గంటలో వచ్చి తన కార్ లోనే అందరం కలిసి డిన్నర్‌కి వెళదాం అన్నాడు. మరొక గంట ఉంది వాళ్ళు రావడానికి.. హోటల్ ఎదురుగా ఉన్న బ్రిడ్జ్ దాటి కేసినోకి వెనక పక్కన వరసగా, వలయాకారంలో

ఉన్న రెస్టారెంట్‌లలో ఒకదానిలోకి వెళ్ళి ఒక కోల్డ్‌కాఫీ తెచ్చుకుంది.. ఓవెన్‌కి ఫోన్ చేసి ' 'గోమతా' ' గురించి చెప్పేసింది.. ఆమెకెంతో ఆనందంగా ఉంది. మెల్లిగా కాఫీ సిప్ చేస్తూ ఆలోచనలో పడింది..

-------------------

దాదాపు ఎనిమిది నెలల క్రితం.. ఈ.హెచ్. ఎస్ శిక్షణ నిమిత్తం బెంగుళూరులో కొత్తగా మొదలుపెట్టిన తమ బ్రాంచి కి వెళ్ళింది.. మొత్తం పదిరోజుల ట్రిప్ అది.. వారాంతాలతో కలిపి పధ్నాలుగు రోజులు.

కేరోల్ కి ఇండియా అన్నా, అక్కడి సంస్కృతి అన్న ఎంతో ఇష్టం.. ఆమె తండ్రినించి పుణికిపుచ్చుకుంది ఆ ఇష్టాన్ని. అతనికి కూడా ఢిల్లీ దగ్గరున్న హరిద్వార్ అన్నా, గంగానది అన్నా ఎంతో ఇష్టం.. నాలుగయిదు సార్లు అతను అక్కడికి వచ్చినప్పుడు కేరోల్ కూడా వచ్చింది. తమకీ, ఇండియాకి ఎదో బలమైన అనుబంధం ఉందని అందుకే ప్రపంచంలో ఇన్ని దేశాలున్నా భారత దేశంతోనే తమకంత ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడిందని వాళ్ళిద్దరూ బలంగా నమ్మేవారు. అంతే కాదు, ఇద్దరికీ ఆధ్యాత్మిక చింతన కూడా ఎక్కువే, దానికి సంబంధించిన ఎన్నో పుస్తకాలు చదివేవారు. కలిసి చర్చించుకునేవారు. ఇద్దరికీ హిందూ ధర్మమన్నా, కర్మ సిద్ధాంతమన్నా గొప్ప గౌరవం.

తండ్రి చనిపోయేముందు, దాదాపు ఆయనకి ఎనభై ఏళ్ళ వయసులో చివరిసారి ఇండియా వెళ్ళారు వాళ్ళిద్దరూ.. మళ్ళీ వెళ్ళలేదు.. ఇన్నిరోజులకి ఇలా ట్రైనింగ్ పేర ఆ అవకాశం రావడంతో సంతోషించింది కేరోల్.

బెంగుళూరు ఆఫీస్‌లో సహోద్యోగులు తననెంతో ఆదరంగా రిసీవ్ చేసుకున్నారు. కొత్తగా కట్టిన ఆఫీసూ, లేబొరేటరీలు అంతర్జాతీయ ప్రమాణాలతో తమ కంపెనీ స్టాండర్డ్‌కి ఏ మాత్రం తగ్గకుండా ఉన్నాయి. మొదటి వారం లేబొరేటరీల తనిఖీ, అక్కడ శాస్త్రవేత్తలతో చర్చలూ, చేపట్టవలసిన చర్యలూ, తీసుకోవలసిన జాగ్రత్తలూ, పాటించవలసిన పద్ధతులూ ఇవన్నీ అందరికీ వివరించి, చిన్న చిన్న రోల్ ప్లేలతో వారికి బాగా అర్థమయ్యేలా చెప్పింది. వచ్చేవారం మిగతా వారికి కూడా చెయ్యాలి, అలాగే తను చెప్పినవన్నీ ఎలా అమలు అవుతున్నాయో కూడా గమనించాలి. అందుకే మరోక వారం ఇక్కడే ఉండాలి.

శుక్రవారం మధ్యాహ్నం లంచ్ సమయంలో ' వారాంతంలో కేరోల్ ఏం చేస్తుంది? ' అన్న ప్రస్తావన వచ్చింది. అప్పుడు కేరోల్ అంది.. తనకి దగ్గరలో ఉన్న శ్రావణబెలగోళ, బేలూరు, హలేబీడు చూడాలని ఉందని.. దానికి కావలసిన వివరాలు ఇస్తే తనొక కార్ పెట్టుకుని వెళ్ళి చూసి వస్తానని చెప్పింది. తనతో ఎంతో అభిమానంగా ఉంటూ వచ్చిన రిచా, ప్రమోద్‌లు తాముకూడా వస్తామని దగ్గరుండి అన్నీ చూపిస్తాం, అది తమకేమీ ప్రోబ్లెం కాదని చెప్పి బయలుదేరారు. ప్రమోద్ కారులో ముందు డ్రైవర్ పక్కన కూర్చున్నాడు, రిచా, కేరోల్ వెనక కూర్చున్నారు.

' హాసన్' అనే ఊరు దాటి ' శ్రావణబెలగొళ' లోకి ప్రవేశించింది కారు. మెత్తగా గాలి వీస్తోంది. గోమతేశ్వరుడి గుడి దగ్గర ఆపాడు డ్రైవర్. కొద్దిగా చల్లటి నీళ్ళు తాగి దాదాపు ఐదువందలకు పైగా ఉన్న మెట్లు ఎక్కసాగారు ముగ్గురూ.. నడవడానికి ఇష్టపడనివారినీ, కష్టపడేవారినీ పైకి తీసుకునివెళ్ళడానికి డోలీలుంటాయి.. కేరోల్ నడవడానికే ఉత్సాహపడింది, ప్రమోద్ దాని గురించి చెప్పినా సరే.

ముగ్గురూ కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు.. పెద్దగా ఎండ లేకపోయినా కేరోల్ ముఖం ఎర్రబడింది.. కళ్ళకున్న చలువటద్దాలు తీసి తుడుచుకుంటూ ఒక్క క్షణం నిలబడిపోయింది ఆమె.. వెంటనే తన మెడలో వేసుకున్న బైనాక్యులర్స్ లోంచి తన

చూపు చిక్కుకుపోయిన వైపు ఆసక్తిగా చూసింది.. మరుక్షణం పెద్ద జూం లెన్స్ ఉన్న తన కెమెరా తో మూడు నాలుగు ఫోటోలు గబ గబా తీసింది.. వాటిని పరీక్ష చేసి బాగా వచ్చాయి అని సంతృప్తిగా తల ఊపుతుంటే రిచా అడిగింది.

"ఏమయింది? " అని..

"కెన్ వి.. మనం కిందకి వెళదామా? " అంది ఏదో చెప్పలేని ఉద్వేగంతో..

"అరే! .. కొన్ని మెట్లు ఎక్కేశాం కదా, కిందకి వెళ్ళి మళ్ళీ పైకి రావడం కష్టం.. పైగా గుడి మూసేస్తారేమో.. ఎనీ ప్రోబ్లెం?" అంది ఆ త్రుతగా.

కేరోల్ తల అడ్డంగా ఊపుతూ.. "లేదు.. ఐ వాంట్ దట్.." అని తను ఫోటో తీసిన వైపుకి చూపింది. అక్కడ పక్కన ఉన్న కాలువలో చిన్న కుక్కపిల్ల ఉంది.

"ఓ.. అదా.. దిగి వచ్చేటప్పుడు చూద్దాం, సరేనా " అంది రిచా. అయిష్టంగానే కదిలింది కేరోల్.

పైకి ఎక్కి దర్శనం చేసుకుని కిందకు దిగేటప్పుడు చూస్తే కాలువలో కుక్కపిల్ల కనిపించలేదు.

"ఓ ఇంతలో ఏమయిపోయింది? " అని దిగులు మొహం పెట్టుకుంది కేరోల్.

రిచా, ప్రమోద్ వాళ్ళిద్దరిలో వాళ్ళే మాట్లాడుకుంటున్నారు, కుక్కపిల్లలు ఒక చోట ఉండవు కద, అదేమీ పెద్ద విశేషం కింద కనిపించలేదు వారికి.

కేరోల్ మాత్రం ఏదో పోగొట్టుకున్నదాన్ని వెతుకుతున్నట్టుగా నలుదిక్కులా చూస్తూనే కార్ ఎక్కింది..

రాత్రికి హాసన్‌లో హోటల్ లో ఉండి మర్నాడు బేలూరు, హలేబీడు చూద్దామని వాళ్ళ ప్లాన్. అన్నీ ఒక రోజులో చూసేయవచ్చు, కానీ బాగా లేట్ అవుతుందనీ, హాయిగా తీరిగ్గా చూద్దామని కేరోల్ అనడంతో సరే అన్నారు. కాసేపు విశ్రాంతి తర్వాత టీ కి కలిసారు ముగ్గురూ.. టీ తాగాకా కేరోల్ అంది..

"ఒకసారి వెనక్కి వెళ్ళి చూద్దామా, ఆ పప్ దొరుకుతుందేమో? " అని..

వాళ్ళిద్దరూ ఆశ్చర్యపోయారు..

"మీరింకా దానిగురించే ఆ లోచిస్తున్నారా? అని ఒకేసారి అడిగారు.

"అవును.. నేనెందుకో దాన్ని మర్చిపోలేకపోతున్నాను.. ముఖ్యంగా ఆ కళ్ళు.. వీలైతే దాన్ని నాతో తీసుకెళదామని అనుకుంటున్నాను"అని పైకి అంది..

' నాకేదో చాలా బలమైన బంధంలా అనిపిస్తోంది.. ఇట్ ఈస్ ఏ నాట్ నార్మల్ స్ట్రే పప్.. ' అనుకుంది తనలో తానే.

ముగ్గురూ మళ్ళీ బయలుదేరారు..తన కెమెరాలో ఉన్న కుక్క ఫోటోలు గుడి దగ్గరున్న వారందరికీ చూపించడం, వారిని దానిగురించి అడగడం.. ఇలా దాదాపు అరగంట పైగా గడిచాకా డోలీలో తీసుకెళ్ళే వాళ్ళల్లో ఒకతను గురురాజు గుర్తుపట్టాడు. గంట క్రితం అది కుంటుకుంటూ వెళుతుంటే పక్క వీధిలో చూసానని చెప్పాడు..

అంతే! అతన్ని కారులో ఎక్కించుకుని పక్కవీధికి వెళ్ళడం, తన దగ్గరున్న తెల్లటి నేప్‌కిన్‌లో ఆ కుక్కని మెత్తగా ఎత్తుకుని కేరోల్ కార్ ఎక్కడమూ క్షణాల్లో జరిగాయి..

అది చాలా చిన్న కుక్క, గోధుమ రంగులో బలహీనంగా ఉంది. కళ్ళు మాత్రం వజ్రాల్లా మెరుస్తున్నాయి.. వాటి రంగు ఇది అని చెప్పడం కష్టం, కాని అవి ఎంత కాంతివంతంగా ఉన్నాయంటే ఒక్కసారి చూస్తే మర్చిపోవడం అసాధ్యం. దాని ఆరోగ్యం అస్సలు బావులేదు. వంటిమీద అక్కడక్కడా గాయాలున్నాయి. ఎక్కడైనా పడిందేమో, ముందర కాలు ఒకటి విరిగి పాపం కుంటుతోంది. ఉండి, ఉండి దగ్గుతోంది, ఆయాసపడుతోంది.. దాని వాలకం చూస్తే ఎన్ని రోజులు బ్రతుకుతుందో ? అన్నట్టుగా ఉంది. ఇలాంటి వీధి కుక్క మీద ఈవిడకింత ఇదేమిటో? అనుకున్నారు రిచా, ప్రమోద్ లు

గురురాజుకి వంద సార్లు థాంక్స్ చెప్పి, రెండు వందలు అతని చేతిలో పెట్టింది కేరోల్. ‘ పప్ కి ముందు పశువుల డాక్టర్ అవసరం కనక వెంటనే బెంగుళూరు వెళ్ళిపోదాం‘ అంది.. కానీ అప్పటికి వర్షం మొదలవడంతో హోటల్‌లోనే ఆగిపోవలసి వచ్చింది.

మర్నాడు ఉదయమే బేలూరు, హలేబీడు కాన్సిల్ చేసుకుని బెంగుళూరు బయలుదేరారు.. వెళుతూనే రెండు మూడు క్లినిక్‌లలో చూపించింది. కానీ దాని పరిస్థితి చూసి వారెవరూ తీసుకోలేదు. అతి దయనీయంగా ఉన్న దాని పరిస్థితి ఒక కారణమైతే, కేరోల్ ఆత్రుత మరొక కారణం.

అప్పుడు అక్కడకి వచ్చిన వారొకరు చెప్పారు ఆమెకి సుజయ అనే ఆవిడ గురించి, ఆవిడకి జంతువులు, ముఖ్యంగా కుక్కలమీద ఉన్న ప్రేమ, వాటికోసం ఆమె చేసే సేవల గురించి.

సుజయ కొన్ని రోజులు ఏదో కంపెనీలో పనిచేసి తర్వాత రాజీనామా చేసి జంతుసేవే ముఖ్య వ్యాపకంగా చేసుకుంది.. ఆ మె భర్త జాగ్‌గా పిలవబడే డాక్టర్. జగదీష్ ఒక అమెరికన్ సైన్స్ కంపెనీలో డైరెక్టర్. వారు దాదాపు పన్నెండేళ్ళు మెల్‌బోర్న్ లో ఉండి తమ దేశానికి వచ్చేశారు.

జంతుసేవ కోసం తను చేసే చాలా కార్యక్రమాలతో పాటు సుజయ ఈ మధ్యనే ఒక ‘క్లినిక్ కం డే కేర్‘ సెంటర్‌ని ప్రారంభించింది. క్లినిక్‌కి ఇద్దరు డాక్టర్లు రోజూ రెండు సార్లు వచ్చి చూస్తారు. అంతే కాక ఇంట్లో వదలలేని పెట్స్‌ని అక్కడ పిల్లలని వదిలినట్టు వదిలి, తమకి కావలసినప్పుడు తీసుకెళ్ళవచ్చు. అలా కొన్ని కుక్కపిల్లలు రోజూ స్కూలు కెళ్ళే పిల్లల్లా చిన్న బుట్టల్లో తమ లంచి డబ్బాలు అవీ సర్దుకు వస్తే మరి కొన్ని తమ హాస్టల్ పిల్లల్లా అక్కడే ఉంటాయి వారి, వారి యజమానులు తిరిగి వచ్చి తీసుకెళ్ళేవరకూ. రోజూ పొద్దున్నే రకరకాల కార్లలో తమ సామాన్లతో పాటు దిగుతూ ఉంటాయి అవన్నీ. తరచూ విదేశీ ప్రయాణాలు చేసే ఎందరో ఉన్న కాలనీలో ఈ ‘డే కేర్ ‘చాలా పేరు సంపాదించింది.

వారిగురించి తెలియగానే మరొక్క క్షణం ఆలోచించకుండా ప్రమోద్‌ని, రిచాని తీసుకుని సుజయ ఇంటికి వెళ్ళిపోయింది కేరోల్. వెళుతూనే సుజయాకి ఆ కుక్కపిల్లని చూపించి దానినెలాగైనా బాగు చేసి తన దగ్గరకు పంపమనీ, ఎంత ఖర్చైనా పరవాలేదని చెప్పింది. సుజయ ఫోన్ చేయడంతో వచ్చిన డాక్టర్ దాన్ని చూసి, ముందు డాక్టర్లు చెప్పిన మాటే చెప్పాడు.

సుజయా, జాగ్‌లు కూడా డాక్టర్‌తో ఏకీభవిస్తూ, అది బ్రతకడమే కష్టమని, ఒకవేళ బ్రతికినా
ఆస్ట్రేలియా దేశపు చట్టాలు ఎంత కఠినంగా ఉంటాయో తమకూ తెలుసనీ, ముఖ్యంగా ‘ క్వారంటైన్ లా‘. మొక్కలూ, జంతువులూ లాంటి జీవరాశుల విషయంలో చాలా కచ్చితంగా ఉండే ఆ దేశానికి ఇలాంటి కుక్కని తీసుకెళ్ళడం దాదాపు అసంభవం అని ఎన్నో రకాలుగా చెప్పారు.

అయినా కేరోల్ వినలేదు..

" నాకవన్నీ తెలుసు.. మీరన్నవన్నీ నిజమే.. కానీ నాకెందుకో దీన్ని విడిచి వెళ్ళడం అసంభవం అనిపిస్తోంది. మీకందరికీ చాలా సిల్లీగా అనిపించవచ్చు, కానీ నాకు దీనికీ ఏదో సంబంధం ఉంది, అది ఈ నాటిది కాదు.. అది మాత్రం నిజం.. మీరేం చేస్తారో, ఎలా చేస్తారో నాకు తెలీదు.. కానీ ఇది మాత్రం నాక్కావాలి. నా ఇంట్లో ఇప్పటివరకూ ఉన్న మూడు కుక్కలతో పాటు ఇది కూడా మా ఇంట్లో తిరగాలి.. ప్లీజ్.. దయచేసి మరోలా అనుకోవద్దు. ఎలాగైనా ఈ మేలు చేసి పెట్టండి.." అప్పటికే ఆమె కళ్ళు నీళ్ళతో నిండి పోయాయి.. తెల్లటి ఆమె ముఖం ఎర్రగా కందిపోయింది..

జాగ్, సుజయా ఆలోచనలో పడ్డారు. ఈ బాధ్యత స్వీకరించడమా, లేదా అని. పొరపాటున కుక్కకేదైనా అయితే, ఒకవేళ బాగుపడినా దాన్ని అక్కడకి పంపగలమా? ఇలాంటి చాలా ఆలోచనలు..

చివరికి జాగ్ అన్నాడు.. " సరే మిస్.. కేరోల్.. మా ప్రయత్నం మేము చేస్తాము, కానీ మీరు మాత్రం ఏది జరిగినా ఒకేలా స్వీకరించగలగాలి. వి డోన్ట్ వాంట్ టూ సీ యూ హర్ట్ లేటర్ " అని.

" ఓ ష్యూర్. కర్మ సిద్ధాంతాన్ని చాలా మంది ఇండియన్స్ కంటే ఎక్కువ నమ్ముతాను నేను.. మన ప్రయత్నం మనం చేద్దాం.. పైన ఆల్మైటీ ఇష్టం, కానీ అతను నన్ను నిరుత్సాహపరచడు.. నాకా నమ్మకం ఉంది " అంది.. అప్పటికి తేరుకుని, సుజయ ఇచ్చిన జ్యూస్ తాగుతూ..

అప్పటినించీ మొదలయింది " ప్రాజెక్ట్ 'గోమతా' "

గోమతేశ్వరుడి గుడి దగ్గర దొరికిందని ఆ మగ కుక్క పిల్లకి 'గోమతా' అని పేరు పెట్టింది సుజయ. ఆ రోజునించీ చంటి పిల్లని సాకినట్టు సాకేది ఆమె. రోజంతా ఇంచుమించు 'గోమతా' సేవే.. డాక్టర్ చెప్పినట్టు టైముకు మందులు, ఆహారం ఇవ్వడం, ఇంజెక్షన్ చెయ్యడం, విరిగిన కాలికి రోజూ రెండు సార్లు తనే డ్రెస్సింగ్ చెయ్యడంతో పాటు ఎన్నో పనులు చేసేది 'గోమతా'కి. మొదట పదిరోజులు పెద్దగా మార్పేమీ కనిపించలేదు.

బెంగుళూరులో ఆఫీస్ పనిమీద ఉన్నన్ని రోజులూ, రోజూ వచ్చి చూసేకి కేరోల్. వెళ్ళేటప్పుడు చెక్ రాసి ఇచ్చి మరీ వెళ్ళింది. అప్పటినించీ రోజు విడిచి రోజూ ఫోన్లు చెయ్యడం, వివరాలు కనుక్కోవడం.

ఇలా ఒక నెలగడిచేసరికి 'గోమతా' కొద్దిగా కోలుకోవడం మొదలుపెట్టాడు. కాలు అతుక్కుని మెల్లి మెల్లిగా నడవడం, దగ్గు కొద్దిగా తగ్గడం చూసేసరికి అందరికీ ఆశ మొదల్యయింది.. అలా దాదాపు ఆరునెలలు గడిచేసరికి బాగా తగ్గి చాలా ఆరోగ్యంగా ఏపుగా పెరిగి ఎంతో బాగా కనిపించేవాడు.

అప్పుడప్పుడూ వీళ్ళు పంపించే ఫోటోలు, వీడియోలు చూసి.. ' 'గోమతా' బావున్నాడు కదా, నాదగ్గరకెప్పుడు పంపుతారు? ' అని అడగడం మొదలు పెట్టింది.. కేరోల్..

అప్పుడే జాగ్ తనకి తెలిసిన, కనుక్కున్న వివరాలని ఆమెకి చెప్పాడు.

ఆస్ట్రేలియాలోకి పెంపుడు జంతువులని డైరక్ట్‌గా తీసుకుని రావాలంటే డిపార్ట్‌మెంట్ అగ్రికల్చర్, ఫిషరీస్ అండ్ ఫారెస్ట్రీ వారు ప్రతిపాదించిన నియమాలన్నీ పాటించాలనీ, వారు అనుమతించిన దేశాలనించి మాత్రమే జంతువులని అనుమతిస్తారని, ఒకవేళ ఆ

దేశాలలో లేని చోట నించి పంపాలంటే ముందుగా ఆ జంతువుని వారు అనుమతించిన మరొక దేశంలో కనీసం మూడు నించి ఆరునెలలపాటు ఉంచి, అక్కడా కూడా దానికి అన్ని పరీక్షలూ చేసి అన్నీ అనుకూలంగా ఉంటేనే వారు అనుమతిస్తారనీ, అక్కడకు వెళ్ళిన తర్వాత కూడా మొదటి నెలరోజులు అక్కడ దగ్గరలోనున్న క్వారంటయిన్ ఆఫీస్‌లోనే ఉంచి, అధికారులు సర్టిఫై చేసినతర్వాత మాత్రమే ఇంటికి తీసుకెళ్ళవచ్చని వివరంగా చెప్పాడు. ఇదంతా చాలా శ్రమ, డబ్బు, రిస్క్‌తో కూడిన వ్యవహారం కనక కేరోల్, ఆమె భర్తా కలిసి ఆ లోచించి చెప్పాలని కోరారు.

భారతదేశాన్నుంచి డైరెక్ట్‌గా ఆస్ట్రేలియాకి పంపడం కుదరదు ఎందుకంటే ఇండియా వారు అనుమతించిన దేశాలలో లేదు. అందుకని రకరకాల కేటగిరీల ప్రకారంగా వారు అనుమతించిన ఏదో ఒక దేశంలో 'గోమతా' ని కొంతకాలం ఉంచి, వైద్యపరీక్షలు జరిపించి అప్పుడు ఆ స్ట్రేలియాకి పంపించడం మాత్రమే మార్గం.

అందుకని జాగ్ సుజయా ఎన్నుకున్న దేశం సింగపూర్.. దానికి కారణం.

అక్కడ వారి ఫ్రెండ్, ఇంతకుముందు జాగ్ టీములో పనిచేసి భర్త ఉద్యోగం వల్ల సింగపూర్ వెళ్ళిన చిత్ర ఉండడమే. ఆమెకి ఫోన్ చేసి వివరాలన్నీ కనుక్కోమన్నారు. అక్కడన్నీ పెద్ద పెద్ద అపార్ట్‌మెంట్‌లే కనక తమతో ఉంచుకోవడం కుదరదు కనక, తాను అక్కడి వివరాలు కనుక్కుని ఫోన్ చేస్తానని, మిగతా ఏర్పాట్లన్నీ చూస్తానని చిత్ర చెప్పింది..

ఆమె సూచించిన ప్రకారం మైక్రోచిప్, వీసా, వాక్సినేషన్ రికార్డులు, రాబీస్‌తో సహా రకరకాల పరీక్షలకోసం జరిపిన రిపోర్ట్లూ, ప్రయాణానికి పదిరోజులు ముందు చేయించవలసిన పరీక్ష వివరాలూ ఇవన్నీ తమకి అందాయని, అన్నీ చేయించి, తయారుగా ఉంచామనీ, 'గోమతా'ని రేపే సింగపూర్ పంపుతున్నామనీ, అక్కడ ఐదు నెలలు ఒక మంచి కెన్నెల్ లోనూ, ఆరోనెల సింగపూర్ క్వారంటయిన్ లోనూ ఆ 'గోమతా' ఉండవలసి వస్తుందనీ, తర్వాత అన్నీ సరిగ్గా ఉంటే స్ట్రేలియా తీసుకుని వెళ్ళవచ్చనీ చెప్పడానికే ఇప్పుడు జాగ్, సుజయా ఫోన్ చేసారు.

' ఇంకో ఆరు నెలల్లో ఆ 'గోమతా' ఇక్కడ తన దగ్గర ఉంటాడు.. ' ఆ ఆలోచనకే ఎంతో థ్రిల్లింగ్ గా ఉంది కేరోల్‌కి. ఫోన్ మోగడంతో ఆలోచనల్లోంచి బయటపడి ఫోన్ ఆన్సర్ చేసి.. "ఓవెన్" వస్తున్నా అంటూ పరుగున బ్రిడ్జ్ క్రాస్ చేసి ఓవెన్‌ని చిన్నపిల్లలా అల్లుకుపోయింది.. ' ఓ ఓవెన్.. యూ నో,. 'గోమతా' విల్ బి విత్ అజ్ సూన్.. ' అంటూ..

మర్నాడు జాగ్ సుజయా 'గోమతా'ని బెంగుళూరులో సింగపూర్ ఎయిర్ లైన్స్ విమానం ఎక్కించడానికి వెళ్ళినప్పుడు సుజయాకి దు:ఖం ఆగలేదు. గత ఎనిమిది నెలలుగా సొంత బిడ్డకన్నా ఎక్కువగా చూసుకుంది వాడిని. అసలే కుక్కపిల్లలంటే అలవి కాని ప్రేమ ఆమెకి, దానికి తోడు ఈ బంధం.. ' రేపటినించీ 'గోమతా' కనిపించడు మనకి జాగ్' అంటూ చిన్నపిల్లలా పైకే ఏడవసాగింది. అతి కష్టమ్మీద ఊరుకుంది జాగ్ ఎన్నో రకాలుగా చెప్పాకా.

వారి ఒక్కగానొక్క కూతురు ప్రీతి ప్రస్తుతం మెల్‌బోర్న్ లోనే బిజినెస్ మేనేజ్మెంట్ చదువుతోంది. ' తనని చూడడానికి వెళ్ళినప్పుడల్లా మనం 'గోమతా' ని చూడవచ్చు' అని చెప్పాకా ఆమె కాస్త స్థిమిత పడింది. వీరిని చూసి కుతూహలంతో ఆ కథంతా తెలుసుకున్న ఎయిర్ లైన్ సిబ్బంది 'గోమతా'కి మరింత ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసారు. "ఎక్కడి కుక్కకి ఎంత భోగం? "అనుకున్నారు అక్కడే ఉన్న కొందరు.

మొత్తానికి 'గోమతా' సింగపూర్ విమానం ఎక్కింది.

అక్కడ చిత్రా, ఆమె భర్త సాయి వచ్చి రిసీవ్ చేసుకుని, ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసి 'గోమతా' అక్కడ హాయిగా ఉండే ఏర్పాట్లు చేసారు. అంతేకాకా దాదాపు వారానికి ఒకసారి వచ్చి చూసేవారు. ఫోటోలు తీసి ఇటు జాగ్, సుజయాలకి అటు కేరోల్ కి పంపేవారు.. అలా ఆరునెలలు గిర్రున తిరిగాయి.

చిత్ర దగ్గరనించి వచ్చిన మెయిల్ చూసి కేరోల్ కి ఫోన్ చేశారు జాగ్, సుజయా. 'గోమతా' ఇప్పుడు ఆస్ట్రేలియా రావడానికి అన్ని రకాల అర్హతలూ పొందాడని..

ఆ మాట విన్న కేరోల్ ఎగిరి గంతేసింది.. ' తనే స్వయంగా సింగపూర్ వెళ్ళి చిత్రని కలిసి థాంక్స్ చెప్పి, 'గోమతా' ని తెచ్చుకుంటానని చెప్పింది.. చెప్పడమే కాదు వెళ్ళితెచ్చుకుంది కూడా.

మెల్‌బోర్న్ క్వారంటైన్ పరీక్షలు కూడా పూర్తి చేసుకుని 'గోమతా' ఇంటికి వచ్చిన రోజున ఇంటినంతా అలంకరించి, చుట్టుపక్కలవాళ్ళందరికీ చిన్న పార్టీ ఇచ్చింది, జాగ్ సుజయాల కూతురు ప్రీతిని పిలవడం మర్చిపోలేదు. అప్పటినించీ ప్రీతి ఆమెకి ఎంతో ప్రీతిపాత్రమయిపోయింది. తరచుగా ఆహ్వానించేది ప్రీతిని. వచ్చినప్పుడల్లా ఆ పిల్లకేమిష్టమో కనుక్కుని మరీ అన్నీ చేసి పెట్టేది..

అలా కొద్దికాలంలోనే ప్రీతికి ఎంతో దగ్గరయ్యారు కేరోల్ ఆమె భర్తా. పిల్లలు' లేని వారిద్దరూ ప్రీతిని తమ బిడ్డలాగే చూసుకునేవారు.

'గోమతా' మాత్రం బాగా అల్లరి నేర్చుకుని ఎప్పుడూ ఉన్నచోట ఉండకుండా ఇల్లంతా గంతులేస్తూ ఉండేవాడు. అంతేకాదు ఇంట్లో సామానంతా విరగ్గొడుతుండేవాడు. మిగతా కుక్కలనెంతో క్రమశిక్షణతో చూసే కేరోల్ 'గోమతా' ని మాత్రం ఏమీ అనేది కాదు, సరికాదా,

" నీ కోసం పదివేల డాలర్లు అప్పు చేశాను, ఒరే! అది తీరేదాకా అయినా ఆగరా, కొత్త ఖర్చులు పెట్టించకు నా చేత "అని ముద్దుగా విసుక్కునేది..

ఇది చూసి ఒకరోజు ప్రీతి నవ్వుతూ అడిగింది

"కేరోల్. నీకు 'గోమతా' లో ఏం నచ్చింది? అంత శ్రమ పడి తీసుకొచ్చావు వాడిని? అని.

కేరోల్ అందంగా నవ్వింది.

"యూ నో ప్రీతీ, .. అదో చిన్న సీక్రెట్.. ఇప్పటివరకూ ఎవ్వరికీ చెప్పలేదు.. మీ అమ్మానాన్నలకి కూడా.. నువ్వంటే నా యంగ్ లిటిల్ ఫ్రెండ్ వి కదా నీకు చెప్తాను సరేనా..

నేను, మా నాన్న హరిద్వార్ వెళ్ళినప్పుడల్లా మా నాన్న వెనక ఒక కుక్క వచ్చేది.. బిలీవ్ ఇట్ ఆర్ నాట్.. వెళ్ళిన ప్రతీసారీ, సేం డాగ్ . చివరికి ఆయన పోయేముందు వెళ్ళిన చివరి ట్రిప్‌లో కూడా. అదేమీ గొడవ చేసేది కాదు, అరిచేది కాదు. నాన్న కనిపిస్తే మాత్రం అతని వెనకే తిరిగేది.. దాన్ని చూసి నాన్న అనేవారు.

'నాకు మీరు ముగ్గురూ ఆడపిల్లలే.. మీకు పుట్టని తమ్ముడేమో వీడు, సొంత కొడుకులా వెంటే తిరుగుతాడు చూడు అని. వాడి కళ్ళు చూడు, వజ్రాలు అనేవారు. యూనో.. 'గోమతా' హాజ్ గాట్ సేం ఐస్. నాన్న వెనక తిరిగిన కుక్క కూడా ఇలాగే ఉండేది..

సేం.. అందుకే నేనంత బాగా కనెక్ట్ అయ్యనేమో. ఎప్పుడూ దక్షిణభారతదేశం వెళ్ళని నేను మొదటిసారి వెళ్ళినప్పుడే వీడు కనిపించడం ఏమిటి? వీడి కళ్ళు చూడగానే నాకు నాన్న మాటలు గుర్తుకు రావడం.. ఇదంతా కేవలం కోఇన్సిడెన్స్ కానే కాదు ప్రీతీ.

ఎక్కడివాళ్ళు ఎక్కడ కలుస్తారో చెప్పలేము కదా ? లేకపోతే వీడు కలవడమే గొప్ప అనుకుంటే, ఈ చిన్నారి 'గోమతా' వల్ల ఎంత మంది కలిసారో, ఎన్ని బంధాలు ముడి పడ్డాయో. మీరు మెల్‌బోర్న్ లో ఉన్నప్పుడు నేను ఎప్పుడూ కలవలేదు. నువ్వు అప్పుడు చిన్నపిల్లవై ఉంటావు. ఇప్పుడు చూడు, మీ అమ్మా నాన్నలిద్దరూ నా కోరికని కొట్టిపారేయకుండా ఎంత సహాయం చేసారు, ఎంత మంచి ఫ్రెండ్స్ అయ్యారు మాకు, అలాగే చిత్ర కూడా.. ఇంక నువ్వైతే యూ ర్ మై డార్లింగ్ ఫ్రెండ్ వి యంగ్ లేడీ.' అంది..

'ఇదంతా వీడివల్లనే సాధ్యపడింది.. కదూ.. ఈ లిటిల్ రాస్కెల్ వల్ల' 'గోమతా' ని ప్రేమగా దగ్గరకులాక్కుంటూ అంది.

ఆ మాటలంటున్నప్పుడు ఆమె ముఖంలో ఏదో తెలియని సంతోషం..

●●●

Click here to share your comments on this story